ఎగిరొచ్చిన అతిథులు

సండే స్పెషల్

సైబీరియన్ పక్షులు సందడి చేస్తున్నాయి. ఖండాంతరాలు దాటి వచ్చి విడిది చేశాయి. ఇక్కడే గూళ్లు కట్టుకుని సంతతిని పెంచుకుంటున్నాయి. ఈ క్రమంలో సైబీరియన్ పక్షులపై ఈ వారం ప్రత్యేక కథనం..

8లో



న్యూస్‌రీల్

చాకరిమెట్లలో శ్రావణ సందడి



సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న దంపతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం సందడి నెలకొంది. శనివారం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు సామూహిక వ్రతాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకుడు దేవాదత్తశర్మ భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు.

చెరువుల వద్దకు వెళ్లొద్దు

ఎస్పీ శ్రీనివాస్‌రావు



చెరువును పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

నర్సాపూర్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం రాయరావు చెరువును పరిశీలించి మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. చెరువులు, నీటి వనరుల వద్దకు వెళ్లవద్దని ప్రజలను కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం 8712656739 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కాగా రాయరావు చెరువు వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించాలని సిబ్బందికి చెప్పారు. ఆయన వెంట సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం ఉన్నారు.

నిల్వ నీటిని తొలగించాలి

డీఏఓ దేవ్‌కుమార్



రామాయంపేట(మెదక్): భారీ వర్షాలతో పంటలకు నష్టం జరిగే అవకాశం ఉండటంతో రైతులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. పంట చేనులో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలన్నారు. కొన్ని మండలాల్లో మొక్కజొన్న, పత్తి చేనులో నీరు నిలిచినట్లు తెలిసిందని, నీటిని తొలగించకపోతే పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలకు ఎరువులు, క్రిమి సంహారక మందులు చల్లవద్దన్నారు. వర్షాలతో జిల్లాలో ఎక్కడా పంట నష్టం జరిగినట్లు సమాచారం లేదన్నారు. ఈమేరకు అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తూ సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా పంటలు దెబ్బతింటే తమకు సమాచారం అందజేయాలని కోరారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శంకర్‌గౌడ్



రామాయంపేట(మెదక్): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రామాయంపేటకు చెందిన శంకర్‌గౌడ్ నియామకం అయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ శనివారం నియామకపత్రం అందజేశారు. ఎంపీ రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడి సహకారంతో తనకు పదవి వరించిందని, పార్టీ నాయకులు, కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని శంకర్‌గౌడ్ హామీ ఇచ్చారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

పెద్దశంకరంపేట(మెదక్)/టేక్మాల్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు అందుబాటులో ఉండాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, పంచాయతీరాజ్, గ్రామ కార్యదర్శులతో వర్షాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కల్పించాలని సూచించారు. చెరువులు, కుంటల వద్ద రైతులకు జాగ్రత్తలపై వివరించాలని సూచించారు. అనంతరం టేక్మాల్ మండలంలో పర్యటించారు. పూర్తిగా వర్షాలు తగ్గే వరకు గుండువాగుల నుంచి రాకపోకలను నిలిపివేయాలన్నారు. ఆయన వెంట ఇతర అధికారులు ఉన్నారు.



ఆలయం ఎదుట ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



రాజగోపురంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

జోరు తగ్గని మంజీరా

- జలదిగ్బంధంలో దుర్గమ్మ
- రాజగోపురంలోనే పూజలు
- పరిస్థితి సమీక్షించిన జిల్లా యంత్రాంగం



వరద పరిస్థితిని తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్): మంజీరా జోరు తగ్గలేదు. సింగూరు నీరు పోటెత్తుతుండటంతో ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతోంది. దుర్గమ్మ ఆలయాన్ని ముంచెత్తుతూ మంజీరా పరవళ్లు తొక్కుతోంది. మూడో రోజు శనివారం కూడా రాజగోపురంలోనే దుర్గమ్మకు పూజలు నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, సిబ్బందితో కలిసి ఏడుపాయలలో వరద పరిస్థితిని సమీక్షించారు. వరుస వర్షాలతో ఎగువ నుంచి సింగూరులోకి 31,400 క్యూసెక్కుల వరద చేరుతుంది. దీంతో ఇరిగేషన్ అధికారులు 6, 8, 9, 10, 11 నంబర్ గేట్లు ఎత్తి 43,300 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. గత రెండు రోజుల కన్నా వరద ఉధృతి పెరిగింది. రాజగోపురంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహానికి భక్తులు పూజలు చేస్తున్నారు. జలకళను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ఏడుపాయల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

వాన జోరు.. వరద హోరు



పొంగి పొర్లుతున్న జగిర్యాల చెరువు

- పొంగిపొర్లుతున్న చెరువులు, కుంటలు
- జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- ముందస్తు చర్యలు చేపట్టిన అధికారులు

నర్సాపూర్/కొల్చారం/రేగోడ్(మెదక్): జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్ రాయరావు చెరువు అలుగు వద్ద శనివారం మత్స్యకారులు గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలు ఉదయం నుంచి చెరువు వద్ద సందడి చేస్తుండగా, పోలీసులు చెరువు వద్దకు ప్రజలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. అలాగే రేగోడ్ మండలంలోని జగిర్యాల చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో జగిర్యాల–రేగోడ్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ పోచయ్య చెరువును సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. కొల్చారం మండలవ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. కింది భాగంలోని వరి పొలాలు నీట మునిగాయి. చిన్నఘనాపూర్ వైపు గల ఘనపురం ప్రాజెక్టు సింగూర్ జలాలతో నిండుకుండలా మారింది. ఆనకట్ట పైభాగం నుంచి రెండున్నర ఫీట్ల మేర నీరు ప్రవహిస్తుండడంతో జలకళ సంతరించుకుంది. పర్యాటకులు సెల్ఫీలు దిగేందుకు నీటిలోకి దిగే ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

నర్సాపూర్: వాతావరణ శాఖ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినందున ఆయా శాఖల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం రాయరావు చెరువును పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలోని నర్సాపూర్, శివ్వంపేట, టేక్మాల్, అల్లాదుర్గం తదితర మండలాల్లో అత్యధిక వర్షం కురిసిందని తెలిపారు. ఆదివారం వరకు వర్ష సూచన ఉన్నందున ప్రజలు అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. సింగూరు ప్రాజెక్టు నుంచి భారీ ఎత్తున నీరు విడుదల చేశారని, మంజీరా పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశామని వివరించారు. ప్రాజెక్టులు, చెరువుల వద్ద పర్యాటకులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. అధికారుల సెలవులు రద్దు చేశామని, అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఆయన వెంట ఆర్డీఓ మహిపాల్‌రెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు. అనంతరం నర్సాపూర్ మున్సిపాలిటీలోని 6, 7, 9వ వార్డులలో కలెక్టర్ పర్యటించారు ఇళ్లలోకి వర్షం నీరు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్‌రెడ్డిని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌ను శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



అలుగు పారుతున్న నర్సాపూర్ రాయరావు చెరువు



పైతర శివారులో నీట మునిగిన వరి పంట

మోక్షమెప్పుడో..?

- పరిష్కారం కాని భూ సమస్యలు
- జిల్లాలో 'భూ భారతి' దరఖాస్తులు 38 వేలు
- ఇప్పటివరకు పరిష్కరించినవి 2 వేలు మాత్రమే..
- పంద్రాగస్టుకు పూర్తి చేస్తామన్న ప్రభుత్వం



మెదక్‌జోన్: భూ భారతి దరఖాస్తుల పరిష్కారం జిల్లాలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఆగస్టు 15 వరకు పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా, క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. జిల్లావ్యాప్తంగా జూన్ 3 నుంచి 20 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అధికారులు 38 వేల దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం 2 వేలు మాత్రమే పరిష్కరించారు. ఈ లెక్కన ఇంకా 36 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగితా వాటిని ఎప్పుడు పరిష్కరిస్తామనేది అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు.

మిస్సింగ్ సర్వే నంబర్లే అధికం

జిల్లాలో భూ సమస్యలకు సంబంధించి మొత్తం 38 వేల దరఖాస్తులు రాగా, అందులో అత్యధికంగా మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించినవే 10 వేల దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించినవి 7 వేలు, సాదా బైనామాలు 6,500, ఫౌతి (మ్యుటేషన్లు) 2 వేలు రాగా, పేర్లు, ఖాతా నంబర్‌లో తప్పులు, పొజిషన్లు, ఇనాం భూములు తదితర వాటికి సంబంధించి మరో 12,500 వరకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత

జిల్లాలో క్షేత్రస్థాయి సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వం జీపీఓలను నియమిస్తామని చెప్పింది. గతంలో వీఆర్‌ఓలుగా విధులు నిర్వర్తించిన వారికి రెండు సార్లు పరీక్షలు నిర్వహించినా, కేవలం 120 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే పరీక్షల్లో 99 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో 492 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో భూములు సర్వే చేసేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించగా, 210 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో మొదటి విడతలో 107 మందికి 50 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మిగితా 103 మందికి ఈనెల 18 నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. కాగా ఇప్పటికే శిక్షణ పూర్తయిన 107 మంది సర్వేయర్లకు ఒక్కొక్కరికి 3 నుంచి 4 మండలాల చొప్పున కేటాయించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న 10 మంది సర్వేయర్లు వీరికి క్షేత్రస్థాయి విధుల్లో సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

త్వరలోనే పరిష్కారం

క్షేత్రస్థాయి సిబ్బంది కోసం రెండు సార్లు పరీక్ష నిర్వహిస్తే 99 మంది జీపీఓలు ఎంపికయ్యారు. వారితో పాటు ఆఫీస్ సిబ్బంది మరో 100 మంది వరకు ఉన్నారు. జిల్లాలో వ్యవసాయ క్లస్టర్లు 76 ఉండగా, పెద్ద క్లస్టర్‌కు ముగ్గురిని, చిన్న క్లస్టర్లకు ఇద్దరు చొప్పున నియమిస్తాం. అలాగే 107 మంది ట్రైనీ సర్వేయర్లు వచ్చారు. ఇక భూ సమస్యలను ముమ్మరంగా పరిష్కరిస్తాం.

– నగేశ్, అదనపు కలెక్టర్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

మెదక్ కలెక్టరేట్: మున్సిపల్, పంచాయతీ కార్మికులకు నిధులు, నియామకాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది నుంచి సబ్బులు, నూనెలు, గ్లౌజ్‌లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు పెంచాలన్నారు. ప్రభుత్వాలు జీఓలను అమలు చేయకపోవడంతో కార్మికులు ప్రతినెల రూ. 6 వేల కోట్లు నష్టపోతున్నారని తెలిపారు. కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ పేర్లతో నియమకాలు చేపడుతూ కార్మికులను అన్యాయం చేస్తుందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడం లేదని వాపోయారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, మహాసభల ఆహ్వాన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడివయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలమణి, మల్లేశం, జిల్లా కోశాధికారి నర్సమ్మ, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డైట్‌లో స్పాట్ అడ్మిషన్లు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ, ప్రైవేట్ డీఈడీ కళాశాలల్లో భర్తీ కాకుండా మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీసెట్– 25లో క్వాలిఫై అయిన అభ్యర్థులు డీఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ కోర్సులలో నిబంధనల ప్రకారం అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ఈనెల 19న మెదక్ ప్రభుత్వ డైట్, 20న ప్రైవేట్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఖాళీల వివరాలు డీసెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

చేగుంట(తూప్రాన్): గిరిజన గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 18న అర్మూర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గురుకులాల రీజినల్ కో ఆర్డినేటర్ గంగారాం నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో గిరిజన గురుకులాల్లో మిగిలిన సీట్లకు మాత్రమే కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో ఆర్మూర్‌లోని చిమన్‌పల్లి గురుకులానికి చేరుకోవాలని సూచించారు.

మల్లన్న ఆలయంలో పెద్దపట్నం



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పెద్ద పట్నం వేసి పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారులు శ్రీకృష్ణుడు, గొల్లభామ, రుక్మిణి వేషధారణలతో ఆలయ సంప్రదాయం ప్రకారం ఉట్టి కొట్టారు. అలాగే ఆటపాటలతో మల్లన్న చరిత్రను వినిపించారు. పంచరంగులతో పట్నం వేసి బోనం సమర్పించి మల్లన్న కల్యాణాన్ని నిర్వహించారు.



రాందాస్ చౌరస్తాలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు

ముకుందా.. మురారి

కృష్ణాష్టమి వేడుకలు శనివారం జిల్లా కేంద్రంలో కనులపండువగా జరిగాయి. సరస్వతీ శిశు మందిర్, సిద్ధార్థ్ విద్యా సంస్థలతో పాటు పలు పాఠశాలల్లో చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో సందడి చేశారు. అనంతరం నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– మెదక్‌మున్సిపాలిటీ





కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



చేగుంటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా తిప్పలు.. క్యూలో రైతులు

చేగుంట(తూప్రాన్): చేగుంట మండల కేంద్రంలో శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. రైతు సేవా కేంద్రానికి యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయం దుకాణం తెరిచేలోగా భారీగా చేరుకున్నారు. కేవలం 240 బస్తాల యూరియా రావడంతో నిర్వాహకులు రైతులను క్యూలో రావాలని కోరారు. దీంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా క్యూలో నిలబడ్డారు. గొడవ జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే యూరియా వచ్చిన గంటలోపే అయిపోయింది. ఆదివారం తెప్పిస్తామని అధికారులు హామీ ఇవ్వగా రైతులు వెళ్లిపోయారు. ఇబ్రహీంపూర్ సహకార సంఘం వద్ద సైతం యూరియా కోసం రైతులు ఎగబడటంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన జవాన్ కుటుంబ సభ్యులు



కొమురవెల్లి(సిద్దిపేట): ఇటీవల అదృశ్యమైన ఆర్మీ జవాన్ అనిల్ కుటుంబ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి ఆచూకీ కనుగొనాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో జవాన్ భార్య అనూష, తల్లి మంగమ్మ తదితరులు ఉన్నారు.

నూతన నియామకం



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఉప్పనూతల కౌశిక్ గౌడ్ జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య చేతులమీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తనపై నమ్మకంతో జాతీయ జాయింట్ సెక్రటరీగా ఎంపిక చేశారని తెలిపారు. బీసీ వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని వేడి చేసి తాగాలి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని మిషన్ భగీరథ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ నాగభూషణం శనివారం తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా సరఫరా అవుతున్న నీటిని శుద్ధిచేసి క్లోరినేషన్ చేస్తున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆరోగ్యం రీత్యా ప్రతి ఒక్కరూ తాగునీటిని వేడి చేసిన తరువాత మాత్రమే వాడుకోవాలన్నారు. తాగునీటి విషయంలో చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా నీటి ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. అందరూ సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.

గృహిణి అదృశ్యం



శాంతాబాయి

పటాన్‌చెరు టౌన్: గృహిణి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కరెంట్ ఆఫీస్ సమీపంలో శాంతాబాయి నివాసం ఉంటుంది. ఈ క్రమంలో జులై 27న ఆమెను చూసేందుకు సోదరి లక్ష్మి వెళ్లింది. అయితే అక్కడి నుంచి శాంతాబాయి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయిందని ఇంటి యజమాని తెలిపాడు. దీంతో ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్కల స్థానికంగా, స్వగ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు.

క్షుద్రపూజల కలకలం

భయాందోళనలో స్థానికులు



షాపు ఎదుట క్షుద్ర పూజల ఆనవాళ్లు


చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. స్థానిక బస్‌స్టాండ్ సమీపంలోని ఓ దుకాణం ఎదుట షాప్ యజమాని ఫొటోను ఉంచి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, నల్లటి బొమ్మ పెట్టి కొబ్బరికాయలు కొట్టి ఉండటాన్ని శనివారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో షాపు ఎదుట క్షుద్రపూజలు చేసి ఉంటారని భావిస్తున్నారు. కానీ ఈ ఘటన స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. షాపు యజమాని ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు.

ఎగిరొచ్చిన అతిథులు



సైబీరియన్ కొంగలు ఖండాలు దాటి వచ్చి సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల పరిధిలోని పలు చెరువులను విడిదిగా మార్చుకుంటున్నాయి. ఏకంగా సుమారు 7 వేల కిలోమీటర్లు ప్రయాణించి వలస వస్తున్న ఈ పక్షులను చూస్తే ఔరా అనాల్సిందే. ఆహార అన్వేషణలో యూరప్ రష్యా నుంచి స్నో వైట్, గ్రే కలర్ కలిగిన రెండు రకాల కొంగలు వలస వచ్చి సందడి చేస్తున్నాయి. ఇక్కడే గూళ్లు కట్టుకుని వాటి సంతతిని పెంచుకుంటున్నాయి. వలస వస్తున్న సైబీరియన్ పక్షులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– మిరుదొడ్డి(దుబ్బాక):



- వలసొస్తున్న సైబీరియన్ కొంగలు
- ఆహారాన్వేషణలో 7వేల కి.మీ. ప్రయాణించి..
- మధ్య ఆసియా నుంచి మన దేశానికి
- ఇక్కడే గూళ్లు కట్టుకుని సంతతి వృద్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

సైబీరియన్ పక్షులు దృఢమైన మూరెడు ముక్కుతోపాటు, పొడవైన తల. విహంగాల్లాంటి పెద్ద పెద్ద రెక్కలు. తెలుపు, నలుపు, గులాబీ రంగులతో దట్టమైన ఈకలు. ఒకేసారి లంఘించి ఎగరడానికి బారెడు కాళ్లు. సుమారు 8 నుంచి 10 కిలోల బరువున్న సైబీరియన్ కొంగలు అవలీలగా ఆకాశంలో ఎగురుతాయి.

ఆహారాన్వేషణలో...

మధ్య ఆసియా యూరోప్ రష్యాలోని సైబీరియా అతి పెద్ద శీతల దేశం. ప్రపంచ దేశాల్లో వేసవి కాలం సుమారు మూడు నెలలు ఉంటే ఇక్కడ ఒక నెల మాత్రమే ఉంటుంది. మే చివరి వారం నుంచి జూన్ చివరి వారం వరకు ఉంటుంది. మిగతా కాలాలు ఎక్కువగా మంచుతో నిండి ఉంటాయి. దీంతో అక్కడ జంతు జాలం మనుగడ సాగించడం కష్టంగా మారుతుంది. చెరువులు, సరస్సులు, నదులు మంచుతో నిండి ఉండటంతో అక్కడ జీవించే సైబీరియన్ పక్షులకు ఆహారం దొరకడం ఇబ్బందిగా మారుతుంది. దీంతో ఆహారం కోసం ఖండాంతరాలు దాటి భారతదేశం వైపు వలసలు ప్రారంభిస్తాయి. ముఖ్యంగా బీహార్‌లోని రాజ్‌కోట్, మహారాష్ట్రలోని పుణేకు భారీగా వలస వస్తాయి. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోని కొల్లేరు, ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలతో పాటు సిద్దిపేట జిల్లాకు వస్తుంటాయి. మిరుదొడ్డిలోని పెద్ద చెరువును విడిదిచేసుకుని ప్రతి యేడాది రాకపోకలు సాగిస్తున్నాయి. జూన్ మొదటి వారం వరకు వేసవి ఉంటుంది. ఇక్కడి చెరువులు, సరస్సులు, రిజర్వాయర్లు, వాగులు వంకల్లో నీటి వనరులు తగ్గిపోవడంతో అందులో లభించే చేపలు, పురుగులను తింటూ కాలం గడుపుతాయి.



చెరువులో సందడి చేస్తున్న సైబీరియన్ పక్షులు

సంతతి కోసం...

సైబీరియన్ కొంగల జీవిత కాలం సుమారు 28 ఏళ్లు. గుడ్లు పెట్టి తమ సంతతని పెంచుకుంటాయి. ప్రతి యేడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఖండాలు దాటి వస్తున్నాయి. తమ సంతతిని పెంచుకోవడానికి మండల కేంద్రమైన మిరుదొడ్డితో పాటు, లక్ష్మీనగర్, అందె, చెప్యాలతో పాటు, కూడవెల్లి వాగు పరిసరాల్లో గుడ్లు పెట్టి పొదగడానికి దృఢమైన పక్షి గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి. గుడ్ల నుంచి బయటకు వచ్చిన పిల్ల పక్షులు 60 నుంచి 70 రోజుల వరకు ఆహారాన్ని సంపాదించుకోలేవు. తల్లి పక్షులే పిల్లలకు ఆహారాన్ని అందిస్తూ ఉంటాయి. 70 రోజుల తర్వాత పిల్లలు స్వతహాగా ఎగరడమే కాకుండా ఆహారాన్వేషణలో పడతాయి.

ఆకట్టుకుంటున్న కొంగలు

ఆహార సేకరణలో భాగంగా సైబీరియన్ కొంగలు చెరువులు, కుంటల్లో ఉండే చేపలు, పురుగులను వేటాడి తింటున్నాయి. ఉదయం ఆహార సేకరణ కోసం చెరువులను ఆశ్రయిస్తుండటంతో సందడిగా మారుతోంది. స్వదేశీ కొంగలతో కలిసిపోయి పొలాల గట్లపై వాలుతున్నాయి. చెరువులు, కుంటలు, పొలాల గట్లపై గుంపులు గుంపులుగా కనిపిస్తున్న ఈ కొంగలను చూసి రైతులు, సందర్శకులు తిలకిస్తున్నారు. సాయంత్రం అయితే అవి ఏర్పాటు చేసుకున్న గూళ్లకు వెళ్తున్నాయి.



సైబీరియన్ కొంగలు అల్లుకున్న గూడు

చాలా పక్షులు వస్తున్నాయి



వలసొచ్చిన కొంగలు వాగులు, పొలాల వద్ద సంచరిస్తున్నాయి. గుడ్లు పెట్టి పిల్లలను కూడా కంటున్నాయి. ఇది వరకు వలస వచ్చిన పక్షులు తిరిగి వానాకాలం చివరి వారంలో వెళ్లిపోయేవి. కానీ ఇవి ఇక్కడే జీవిస్తున్నాయి.

– రాజయ్య, రైతు, మిరుదొడ్డి

సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



సైబీరియన్ కొంగలు పెట్టిన గుడ్లను కోతులు నాశనం చేస్తున్నాయి. వాటి ఉనికికి ప్రమాదం పొంచి ఉంది. గూళ్లు కట్టుకుని పిల్లలను పొదిగే వరకు వలస పక్షుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– సూకూరి ప్రవీణ్, కేరింగ్ సిటిజెన్ కలెక్టివ్, ఉమ్మడి జిల్లా కన్వీనర్

యూట్యూబ్‌లో చూసి చోరీలు

- పోలీసులకు చిక్కిన ముగ్గురు దొంగలు
- నగదు , మద్యం బాటిళ్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: చెడు అలవాట్లకు బానిసై దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులు కటకటాల పాలయ్యారు. శనివారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 7న పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు చోరీపై కేసు నమోదు చేసిన సీఐ మహేశ్ తన బృందంతో దర్యాప్తులో భాగంగా అనుమానితులుగా భావించి నిందితులను పట్టుకోవడంతో చోరీలు బయట పడినట్లు తెలిపారు. వెల్దుర్తి మండలం మానేపల్లికి చెందిన గూడెపు శ్రీకాంత్, చర్ల లింగం, కట్ట ప్రసాద్ చెడు అలవాట్లకు బానిసయ్యారు. ఈజీ మనీ కోసం యూట్యూబ్‌లో సెర్చ్ చేసి చోరీలకు పాల్పడినట్లు ఎస్పీ తెలిపారు. గత నెలలో ట్రాక్టర్‌తో గుమ్మడిదల క్రాస్ రోడ్డులో గల ఏటీఎంకు తాడు కట్టి ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. ఏటీఎం నుంచి సైరన్ రావడంతో అక్కడి నుంచి పారిపోయారు. గత నెల 30న వెల్దుర్తిలోని సెంట్రల్ బ్యాంకు గోడను పగులగొట్టి లోపల ఏటీఎం చోరీకి యత్నించారు. సైరన్‌మోగడంతో పరారయ్యారు. ఈనెలలో శ్రీకాంత్, లింగంలు కలిసి గుమ్మడిదలలోని భవాని వైన్ షాపు గోడకు రంధ్రం వేసి ఖరీదైన మద్యం బాటిళ్లు, రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. ఈనెల 7న మెదక్ పట్టణం ఆటోనగర్‌లో గల ఎస్‌బీఐ(ఏడీబీ) బ్యాంకులో చోరీకి యత్నించి విఫలమయ్యారు. అదే రోజు రాత్రి కొడిపల్లిలో గల వైన్‌షాప్‌లో లిక్కర్ దొంగతనం చేశారు. నిందితుల్లో ఒక్కడైన లింగం తన బైక్‌ను ఫైనాన్స్ నుండి విడిపించుకునేందుకు తన స్నేహితులు శ్రీకాంత్, కట్ట ప్రసాద్‌లతో కలిసి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. అలాగే నిందితులు ఉపయోగించిన ట్రాక్టర్, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో పాపన్నపేట మండలం పేరూర్ గ్రామానికి చెందిన ఆటో దొంగ పక్రుద్దీన్‌ను సీసీ టీవీల ఆధారంగా పట్టుకున్నారు. ఈమేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన మెదక్ టౌన్ సీఐ మహేశ్, టీం సభ్యులు ఎస్ఐ అమర్, తదితరులను, కొడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి, కానిస్టేబుల్ బాగయ్యను ఎస్పీ, అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్నకుమార్ అభినందించారు.

వర్షానికి కూలిన ఇల్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో పాక్షికంగా కూలిపోయాయి. మండల కేంద్రంలో రెండు ఇళ్లు, జగ్గంపేటకలో ఓ ఇల్లు కూలిపోయింది. శనివారం తహసీల్దార్ సహదేవ్ కూలిన ఇళ్లను పరిశీలించారు. రెండురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివాసముంటున్న వారు ఖాళీ చేయాలని తహసీల్దార్ సూచించారు.



జగ్గంపేటలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

చెరువుల్లా పంట పొలాలు

భారీ వర్షాలకు పంట పొలాలు మునిగి చెరువులను తలపిస్తున్నాయి. సంగారెడ్డి మండలం ఇరిగిపల్లిలో పత్తి, వరి పంటల్లో మోకాళ్లలోతు నీరు చేరింది. పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



చెరువును తలపిస్తున్న వరి పొలాలు



సంగారెడ్డి శివారులో జలమయమైన పత్తి చేను



నారాయణఖేడ్ : అలుగుపారుతున్న గంగాపూర్ రిజర్వాయర్

పార్శిల్ కోసం లింక్ ఓపెన్ చేస్తే..

రూ. 78వేలు మాయం

నర్సాపూర్ రూరల్: ఆన్‌లైన్ పార్శిల్ కోసం లింక్ ఓపెన్ చేయగా సైబర్ నేరగాళ్లు డబ్బులు కొట్టేశారు. ఎస్సై లింగం కథనం ప్రకారం... పట్టణానికి చెందిన ఎండి ఖలీమ్ గత నెల 25న తనకు రావలసిన పార్శిల్ రాలేదని ఫోన్ ద్వారా గూగుల్లో టేడెక్స్ స్పీడ్ పోస్ట్ అనే వెబ్ సైట్‌ను ఓపెన్ చేశాడు. మీ అడ్రస్ తప్పుగా ఉంది, మరోసారి అడ్రస్ అప్డేట్ చేయండి అని తెలిపారు. అడ్రస్ అప్‌డేట్ చేయగానే ఓటీపీ వచ్చింది. దీనిని టేడెక్స్ స్పీడ్ పోస్ట్ వెబ్‌సైట్ వారికి తెలిపాడు. ఆరోజు సాయంత్రం నుంచి మూడు దఫాలుగా అతని బ్యాంక్ ఖాతా నుంచి రూ.78294 కాజేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పొలం వద్దకు వెళ్లిన వ్యక్తి మృతి

హత్నూర(సంగారెడ్డి): పొలం దగ్గరికి వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిక్ మద్దూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మయ్య(45) ఉదయం పశువుల మేత కోసం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం అవుతున్నా రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూడగా మడిలో మృతి చెంది ఉన్నాడు. మృతుడికి మూర్ఛ వ్యాధి ఉందని, మూర్ఛ వచ్చి మృతి చెంది ఉంటాడని స్థానికులు, కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కనీస వేతనాల అమలులో విఫలం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



మాట్లాడుతున్న అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి, వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి జరుగుతున్న క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ పరిశ్రమ కాంట్రాక్టు కార్మికులతో క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాములు మాట్లాడుతూ.. 2007 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు జీవోలను సవరించకపోవడం అత్యంత దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు సవరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. జిల్లాలో 1700 పరిశ్రమలు ఉన్నాయని, సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వేలు నిర్వహించి సమస్యలను గుర్తించి పోరాటం నిర్వహిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఎక్కడికక్కడ జరిగే పోరాటాల్లో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాండు రంగారెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు విష్ణు, గంగాధర్, కార్మికులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ..

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలో రెండు ఇళ్లలో చోరీ జరిగింది. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... బృందావన కాలనీకి చెందిన బోయిని రాజేందర్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 14న కుటుంబంతో స్వగ్రామానికి వెళ్లాడు. తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు, తాళాలు పగులకొట్టి ఉన్నాయి. బీరువాలోని మూడున్నర తులాల బంగారం, వెండి, డబ్బును గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. ఇదే కాలనీకి చెందిన కుమ్మరి సంగమేశ్వర్ ఈనెల 15న కుటుంబంతో కలిసి శ్రీశైలానికి వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చి చూడగా మూడున్నర తులాల బంగారం, డబ్బు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లిక్కర్ మార్ట్‌లో..

రామాయంపేట(మెదక్): స్థానికంగా ఉన్న ప్రకృతి లిక్కర్ మార్ట్ (వైన్స్)లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం... గుర్తుతెలియని అగంతకులు మార్ట్ పక్కనే ఉన్న పర్మిట్ రూం తాళాలు పగులగొట్టి లోపలి భాగంలో మార్ట్ గోడకు కన్నం పెట్టి చోరీకి పాల్పడ్డారు. దుండగులు గల్లా పెట్టెలో ఉన్న రూ. రెండు వేలతోపాటు రెండు బీరు బాటిళ్లను ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాలో నిందితుల ఆనవాళ్లు నమోదయ్యాయి.

ప్రమాదంలో 'సింగూరు'.!

- అధికారుల నిర్లక్ష్యం.. రైతన్నలకు శాపం
- నాడు నీటిని విడువలేదు.. నేడు వద్దన్నా విడుస్తున్నరు
- 3 లక్షల క్యూసెక్కులు వచ్చినా ఘనపురానికి ఢోకాలేదు



పొంగి పొర్లుతున్న ఘనపురం ప్రాజెక్టు



సింగూరు ప్రాజెక్టు

మెదక్ అర్బన్ : రోజు రోజుకు పెరుగుతున్న వరదతో సింగూరు ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో పడింది. దీంతో దిగువన ఉన్న ఘనపురం ప్రాజెక్టు రైతాంగం ఆందోళనకు గురవుతుంది. అయితే 520 మీటర్ల నీటిమట్టాన్ని కాపాడుతూ అధికారులు దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. అయితే ఘనపురం ఆనకట్ట మాత్రం 3 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినా తట్టుకునే శక్తి ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

నిర్లక్ష్యమే ముంచుకొచ్చిందా..!

మంజీరా నదిపై 1986లో సింగూరు ప్రాజెక్టును నిర్మించారు. నిల్వ నీటి సామర్థ్యం 29.91 టీఎంసీలు. ఇందులో పరిమితికి మించిన నీటిని నిల్వ ఉంచడం ద్వారా ప్రాజెక్టు రివిట్‌మెంట్, మట్టి కట్ట, పారాపిట్ వాల్‌లు దెబ్బతిన్నాయని జూన్ 23న పర్యవేక్షించిన ఆనకట్ట భద్రతా కమిటీ పేర్కొంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని, 520 మీటర్ల కన్నా ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించింది. అయినా వేసవిలో కేవలం రూ. 20 లక్షలతో రివిట్‌మెంట్ వెంట ఇసుక సంచులు వేశారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో 31,400 క్యూసెక్కుల ప్రవాహం ప్రాజెక్టులోకి వస్తుంది. దీంతో 6 నుంచి 11వ వరకు గేట్లు ఎత్తి 43,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఘనపురం ఆనకట్ట భద్రమేనా!

సింగూరు ప్రాజెక్టుకు ఏదైనా ప్రమాదం జరిగితే ఘనపురం ఆనకట్ట ఎంత వరకు భద్రమన్న ఆందోళన రైతులలో వ్యక్తమవుతుంది. గతంలో 1984లో సుమారు 3 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహం వచ్చినా ఆనకట్టకు ఎలాంటి ముప్పు ఏర్పడలేదని రిటైర్డ్ ఈఈ పేర్కొన్నారు. అయితే ఆయకట్టు ప్రాంతాలు , పంటలు మునిగి భారీ నష్టం సంభవించే అవకాశం ఉంది. వెంటనే అధికారులు ఎలాంటి ప్రమాదం రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మొత్తుకున్నా నీరు విడువలేదు



సింగూరులో నీరు నిల్వ ఉన్నప్పటికీ తుకాల కోసం ఘనపురానికి నీరు విడువలేదు. ఇప్పుడు వదులుతున్న నీరు వృథా అవుతుంది. అప్పుడే వదిలి ఉంటే పంటలు ఏపుగా పెరిగేవి. అధికారులు ఘణపురం ప్రాజెక్టుకు, పంటలకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి.

– రామకిష్టయ్య, రైతు, తుక్కాపూర్

అప్రమత్తంగా ఉన్నాం

సింగూరు ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రాజెక్టు 5 గేట్లు ఎత్తి 43,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నాం. ఆనకట్ట భద్రతా కమిటీ ఇచ్చిన సూచనలు పాటిస్తున్నాం. దిగువ ప్రాంతాల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– నాగరాజు, డీఈ, సింగూరు ప్రాజెక్టు